# మిణుగురు పురుగులు

## శంకరమంచి పార్థసారథి

ఆమె పేరు కమల—

ఆమె కళ్ళు వెడల్పుగా, చక్రాల్లా వుంటాయి. ఆమె ఒంటిరంగు బంగారం పోతపోసినట్లుంటుంది. ఆమెనోరు లక్కపిడతలా చిన్నగా వుంటుంది. ఆమె పెదిమలు పండిన దొండ పండులా వుంటాయి. ఆమెజడ పొడుగ్గా వుండటంవల్ల నడుసుంటె పిరుదలతో ఆటలాడినట్లుంటుంది. ఆమె అంగసౌష్ఠవం, వున్న వారిల్లులా అందంగా, ఆరోగ్యంగా వుటుంది.

ఆమెది అందరిలాంటి అందంకాదు. ఎదుటి వారిని పిచ్చివారిని చేసే అందం. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం.

ఆమె నా ప్రక్క వాటాలోకొచ్చి మూడు నెలలే అయింది. నాకు మా వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు చేస్తుండటంవల్ల, ముందుగానే జాగ్రత్తపడి ఈ ఇల్లు తీసుకున్నాను. నాకు ఆమెతో పరిచయం చాలా తక్కువ. కాని ఆమెని చూసినప్పుడల్లా ఆమెతో పరిచయాన్ని పెంచుకోవాలని వువ్విళ్ళూరుతుండే వాడిని. ఆమెకెవరూ మొగదిక్కు లేనట్లుంది. ఆమె ఒక్కతే వుండేది. ఆమెకి తోడు తన ఎనిమిదేళ్ళ కొడుకు మాత్రమే. ఆమె భర్త మిలటరీలో పన్చేస్తూ ప్రాణాలొదిలాడని, అప్పటినించి వుద్యోగంచేసి బ్రతుకుతూ కొడుకును చదివిస్తోందని, చుట్టుపక్కల అమ్మలక్కలు సర్వేచేసి తెల్సుకున్నారు.

నాకు స్వతహాగ వుద్యోగంచేసే ఆడవాళ్ళంటె అమితమైన జాలి, సానుభూతి. నాలుగు గోడల మధ్యన, కడుపులో నీళ్ళు కదలకుండా, వుండాల్సిన వాళ్ళని, పొట్టతిప్పల కోసం రోడ్డుకెక్కించిన ఈ వ్యవస్థమీద చెప్పరాని కోపం — అది వేరే విషయం, వదిలెయ్యండి.

నాకు ఆమెమీద గౌరవం అధికం కావటానికి బహుశా ఇదొక కారణం కావచ్చు. ఏది ఏమైనా చాలా కొద్దిరోజులోనే ఆమంటె అంతులేని అభిమానాన్ని పెంచుకున్నా, మా యిద్దరివి ప్రక్కప్రక్క ఇళ్ళు కావటంతో సాయంత్రంపూట, తీరుబడిగా వున్నప్పుడు, ఏదైనా పుస్తంకోసమో, ఆరోజు పేపరు కోసమో వస్తుండేది. అలా మొదలైన మా పరిచయం అనతికాలంలోనే వృద్ధిపొంది, రోజూ సాయంకాలం గంటలతరబడి బాతాఖాని కొట్టే వరకు వచ్చేసింది. ఇపుడు మా ఇద్దరి మధ్య ఎటువంటి అరమరికలుగాని, బెదురు భయాలుగాని లేవు. ఆమెకష్టం నాకు చెబుతుంది. నా చేతనైన సలహా యిస్తాను. ఆమె టీ చేసుకుంటే నాకూ తెచ్చిపెడుతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, మేమిద్దరం మంచి స్నేహితులం. మా స్నేహంలో నీచమైన ఆలోచన్లు, అభిప్రాయాలులేవు. అక్షరాల ఆరోగ్యప్రదమైన స్నేహం.

అతడి పేరు గోపాలం—

పూర్తిపేరు గోపాలకృష్ణ. హెచ్ఎయల్‌లో పన్చేస్తాడు. నాకున్న మంచి స్నేహితుల్లో వాడొకడు.

నల్లగా, పొట్టిగా వుంటాడు. వాడిగడ్డం ఎప్పుడూ నున్నగా గీయబడి వుంటుంది. వాడి బట్టలు ఎప్పుడూ నలిగిపోయిగాని, మాసిపోయి గాని కన్పించవ్. వాడిచేతిలో ఎప్పుడూ సిగిరెట్ కాలుతూవుంటుంది. వాడికెప్పుడూ వూరంతా అప్పులుంటూనే వుంటాయ్. డబ్బులకోసం అప్పులాళ్ళొస్తే వాళ్ళకి కథల్చెప్పి, వాళ్ళ దగ్గర్నించే ఎదురుపుచ్చుకోగల సమర్థుడు. ఎప్పుడూ సందడిగా తిరుగుతుంటాడు. సందడికి, వుత్సాహానికి, మంచి మనస్సుకి మారుపేరు— మా గోపాలం.

ఏ మనిషి పరిపూర్ణుడు కాలేడు. ప్రతివారికి

ఏదో ఒక బలహీనత వుంటూనే వుంటుంది. అలానే గోపాల్‌కి గూడా ఒకే ఒక బలహీనతుంది.

గోపాలకృష్ణని వాళ్ళ పెద్దవాళ్ళు పేరుపెట్టేరనో, మరెందుకోగాని, వాడు కృష్ణావతారంలోని మిగతా విషయాలకన్నా, శృంగారాన్ని బాగా వంటబట్టించుకున్నాడు. వాడికి ఆడపిల్లలంటే ఆసక్తి కాస్త జాస్తి. వాళ్ళగురించి యెంతో డబ్బు ఖర్చుచేస్తుంటాడు. అసలు వాడికి యెంత మంది గర్ల్‌ఫ్రెండ్సున్నారో కచ్చితంగా వాడికే తెలీదు. నేను యెన్నోసార్లు హెచ్చరించాను. కాని ఫలితం శూన్యం.

వాడికి భగవంతుడో గిఫ్టిచ్చాడు. ఆడదాని మొహం చూసి, ఆమె జాతకం గడగడా చెప్పెయ్యగలడు. ఆమె యెలాంటిది? మన స్తత్వం ఏమిటి మొదలైన వివరాలన్నీ పూస గుచ్చినట్లు చెపెయ్యగలడు. అసలు సావిత్రి, అనసూయ వాళ్ళ రోజుల్లో వీడు పుట్టుంటే వాళ్ళని గూడా సరిచేసేవాడని నాకో భయం వుంది. అలాగని పూర్తిగా చెడ్డవాడేంకాదు. నిప్పులాంటి ఆడవాళ్ళని చూస్తే చేతులెత్తి దణ్ణం పెడతాడు.

ఈ ఒక్క బలహీనత మినహాయించి అతడు మంచి స్నేహితుడు. అందుకే వాడితో నా స్నేహాన్ని కొనసాగించాను.

అసలిప్పుడు నా బాధంతా వాడి గూర్చిగాని, వాడప్పులు గూర్చిగాని, లేక వాడి గర్ల్‌ఫ్రెండ్సెంతమందనిగాని కాదు.

వాడి దృష్టిలో కమల, నా స్నేహితురాలు పడింది. అది నాకో సమస్యయి కూర్చుంది. అదెలా జరిగిందంటే——

ఒకరోజు కాస్త బద్ధకంగా వుండి ఆఫీసుకి పోలేదు. సాయంత్రానికల్లా వాలాడు మా ఇంటి ముందు.

సరిగ్గా అదే సమయానికి కమల మా ఇంట్లో కూర్చుని కబుర్లు చెపుతోంది.

ఆమెని చూశాక రెండు నిమిషాలు అలాగే నిల్చుండిపోయాడు. లోపలికొచ్చి కూర్చొన్నాక గూడా, ఒక అయిదు నిమిషాలపాటు తీక్షణంగా ఆమె వంకే చూస్తూ కూర్చున్నాడు.

కమల మరో వ్యక్తి ప్రవేశంతో కబుర్లాపి 'వస్తానండి' అంటూ ఆ రోజు పేపరుతీసి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే గుడ్లప్పగించి చూస్తున్న వాడితో "ఏం, ఇలా తగులడ్డావ్? ఎవరూ తగల్లేదా?" అన్నాను.

"ఎవరామె?"

"పార్టీకెళ్ళాలన్నావ్. వెళ్ళలేదా?"

"నీ ప్రక్కవాటాలో వుంటుందా?"

"ఏదైనా పనిమీదొచ్చావా?"

"ఇంత అందమైన అమ్మాయుందని నాతో ఎన్నడూ చెప్పలేదే?"

నాకు ఒళ్ళు మండుకొచ్చింది. ఎన్ని మాటలాడినా వాడు సంభాషణ అటువైపునే తిప్పటంతో నాకు చిర్రెత్తుకొచ్చింది. అందుకే కాస్త సీరియస్‌గా "యూ ఫూల్-నీ వెధవదృష్టి ఆమె మీదెయ్యకు. ఆమె దేవత-నిప్పు-నిప్పులాంటిది. మాడి మసైపోతావ్ జాగ్రత్త" అన్నాను.

నా కోపం చూసో, మరెందుకోగాని వాడు పగలబడి నవ్వాడు. తర్వాత నవ్వాపుకుంటూ "సర్లె-కానిని కాఫీనీళ్ళన్నా కొట్టించు. నీ గురించి చాలా దూరం పడొచ్చాను" అన్నాడు.

నేను మౌనంగా లేచి, బట్టలేసుకుని, ఇంటికి తాళంవేసి, వాడితోపాటుగా రోడ్డెక్కాను.

హోటల్లో కూర్చున్నాక, మళ్ళీ అదే సంభాషణ మొదలెట్టాడు. "ఆమెవరు? ఎక్కడన్నా పనేస్తుందా? పెళ్ళయిందా?"

ఈసారి నాకు రెట్టింపు కోపం వచ్చింది.

కమల నా స్నేహితురాలు-మంచిది. విధి వంచితై, తనకాళ్ళమీద తాను నిలబడి, ఒక్కగానొక్క తన కొడుకుని వృద్ధిలోకి తీసుకురావాలని తంటాలుపడుతోంది. అటువంటి అభాగ్యురాల్ని ఈ కోతి వెధవ తన సహజమైన వెధవ దృష్టితో చూస్తూ, పైగా నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేయటంతో నాకు బి.పి. పెరిగింది.

"రేయ్ ఇందాకే చెప్పాను——ఆమె వూసెత్తద్దని. ఆమె నువ్వనుకుంటున్నట్లుగాని, నీకు పరిచయం వున్న ఆడవాళ్ళ లాంటిదిగాని కాదు. ఆమె సంగతొదిలేయ్ —— ప్లీజ్" అన్నాను

రౌద్రంగా.

నేనింత కండలు చించుకుని మాట్లాడినా, వాడి మొహంలో ఎటువంటి మార్పు రాక పోవటం, నాకు ఆశ్చర్యం అనిపించింది.

వాడు తాపీగా సిగరెట్ తీసి వెలిగించి, "నీకు ఆడవాళ్ళతో అనుభవం తక్కువ. నీకు పెళ్ళి కాలేదు. కనీసం కనెక్షన్స్‌గూడా లేవు. కాని నేను గత పది సంవత్సరాలుగా ఆ ఫీల్డులో రీసెర్చి చేసాను. వాళ్ళొదిలిన శ్వాసనుబట్టి, నిలబడే తీరునిబట్టి, వాళ్ళ గుణగణాలని చెప్పెయ్యగల్ను" అన్నాడు.

నేను వింటున్నాను. వింటూ నా కోపాన్ని దాచాలని ప్రయత్నిస్తున్నాను.

"అసలు నీకు ఆడవాళ్ళలో ఎన్ని తెగ లున్నారో తెల్సా? తెలీదు. పూలల్లో ఎన్ని రకా లున్నాయో, ఆడవాళ్ళలో అన్ని రకాలవాళ్ళు న్నారు. కాని మనం కన్వీనెంటుగా, వారందరిని మూడు భాగాలుగా విభజించుకోవచ్చు."

వీడొచ్చి నన్నీ విధంగా తినెయ్యటం నాకేమాత్రం ఇష్టంలేదు. అయినా అలాగే కూర్చుని వాడి ప్రేలాపనని వినసాగాను.

"వాళ్ళల్లో మొదటి తరగతి పద్మినీ జాతి



స్త్రీలు. అంటే వాళ్ళు మనసా, వాచా, కర్మణా పతివ్రతలు. వాళ్ళు తీక్షణంగా చూస్తే మన లాంటి పక్షులు మసైపోతారు. వాళ్ళే నిజమైన పతివ్రతలు-ఇంక మూడో జాతి—"

"రెండోజాతి ఏమైనట్లు?"

"తొందరపడకు. చెపుతా. అన్నీ విపులంగా చెబుతా. ముందు మూడో తరగతి వాళ్ళనిగూర్చి ముచ్చటిస్తా. వీళ్ళు బాహాటంగా, అరమరికలు లేకుండా, బ్రతుకుతెరువు కోసం, తమ శరీరాలని, అందాన్ని, వయసుని అంగట్లోపెట్టి అమ్ముకుంటారు. పూర్ క్రీచర్స్!" మాట్లాడటం ఆపి, సిగరెట్టుని గట్టిగా పీల్చి, కాఫీ కలుపుతూ "ఇక మూడోజాతుంది చూశావ్—వీళ్ళు చాలా డేంజరు. పైకి చూట్టానికి పచ్చి పతివ్రతల్లా కన్పిస్తారు. వాళ్ళ మాట, నడవడి, తీరు అన్నీ పతివ్రత లక్షణాలే. కాని వీళ్ళకి లోపాయికారి మనలాంటి కస్టమర్స్, ఎకౌంటు హోల్డర్సుంటారు—ఎందుకనడక్కు. అది వేరే ప్రశ్న. అసలది వేరే సబ్జక్టు"

కాఫీ తాగుతూ నావంక చూసాడు.

అసలిదందా నాకెందుకు చెప్పాడో అర్థం కాక, అడిగాను.

వాడు కాఫీ పూర్తిగా తాగేసి, బిల్లుని నా చేతికిస్తూ "మీ ఫ్రెండు, మీ నైబర్—కమల నే చెప్పిన రెండోజాతికింద కొస్తుందని నా డవుటు" అన్నాడు.

"షటప్"

"అలా మండిపడకురా అబ్బీ! చెప్పాగా నీ కనుభవం తక్కువని. ఈ విషయాల్లో నే చెప్పిందే కరక్టు. తిరుగులేదు."

"అట్లా దారుణంగా మాటాడకు. కళ్ళు పేలి పోతాయ్."

"అనవసరంగా హైరానపడకు" వాడి చిరునవ్వు, మాట్లాడే తీరు చూసేసరికి నా సహనం పూర్తిగా అడుగంటిపోయింది.

"మిస్టర్ గోపాల్-మనం స్నేహితులుగా మిగిలిపోవాలంటే, దయచేసి ఆమెగూర్చి మాటాడకు. ఆమె దేవత. బ్రతుకుతో పోరాటం సల్పుతోంది. అటువంటి అభాగినులతో ఆడుకోకు. నీ బ్రాండ్ ఆడవాళ్ళతో నువ్వేమైనా చేసుకో! కాని కమల జోలికి రాకు. ప్లీజ్" వాడేమనుకున్నాడో తెలీదుగాని, పైకిమాత్రం "సరే ఇట్సాల్‌రైట్ - కాని నిన్ను చూస్తే జాలేస్తోంది. మిణుగురు పురుగుల్ని చూసి నిప్పని భ్రమించకు. గుర్రం గాడిద ఒక్కటి కావు. వస్తాను" అన్జెప్పి లేచి వెళ్ళిపోయాడు.

అప్పటినించి కమలంటే నాకు జాలి, అభిమానం అధికం అయినాయ్. ఆమెని చూసినప్పుడల్లా, గోపాలన్న మాటలు గుర్తుకొచ్చి బాధగా వుండేది.

ఒకరోజు వుండబట్టలేక అడిగేశాను "నీ భర్త పోయాడని విన్నాను. మళ్ళీ వివాహం ఎందుకు చేసుకోలేదు?" అని.

నానుంచి ఇటువంటి ప్రశ్న నాశించని ఆమె రెండు క్షణాలు కంగారుపడింది. తర్వాత మెల్లిగా తలెత్తి "నా కిష్టంలేక. మా వాళ్ళు చాలా బలవంతం చేశారు. కాని ఆయన శారీరకంగా దూరమయ్యారేగాని నా గుండెలో ఇప్పటికీ సజీవంగా వున్నారు."

నాకు జాలేసింది. "కాని కమలా-ఈ భౌతిక ప్రపంచంలో బ్రతకాలంటే మొగదిక్కు కావాలి. ఆడది ఒంటరిగా బతికెయ్యగల రోజులు ఇంకా మన దేశంలో రాలేదు. గుర్తుంచుకో."

"అవును. అదీ నిజమే. అందరూ నన్ను చూసి తలోమాటంటారు. నన్నుచూసి గుసగుసలాడుకుంటారు. నేనెంత నిజాయితీగా బతుకుతున్నా నా శీలాన్ని శంకిస్తారు. కాని.... నేనేం పట్టించుకోను. నా మనస్సే నాకు సాక్షి."

నాకా క్షణంలో కమలమీద ఎంత అభిమానం పెరిగిందో, గోపాల్‌మీద అంత చులకనభావం ఏర్పడింది.

ఆ తర్వాత ఆ సంభాషణని యిద్దరం కొనసాగించలేదు.

తర్వాత చాలా రోజుల వరకు గోపాల్ నన్ను కలవలేదు. ఉన్నట్లుండి ఒకరోజు సుడిగాలిలా వచ్చిపడ్డాడు ఆఫీసుకి.

రావటంతోటే చురుకుగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ "హల్లో డియర్ ఎల్లావున్నావు? హౌ యీజ్ యువర్ నైబర్" అన్నాడు.

నేను కోపంగా వాడివంక చూసేను.

"ఆయామ్ సారీ. బైదిబై నా కర్జంటుగా ఓ వచ్చనోటు సర్దుబాటుచెయ్యి. షరా మామూలే. తారీఖు రాగానే ఇచ్చేస్తాను. చాలా అర్జంటు. ఆటో వెయిటింగ్ అవుట్ సైడ్-ప్లీజ్."

నాకు నవ్వొచ్చింది. అయినా నవ్వునాపుకుంటూ "దేనికిట" అడిగేను.

"వివరాలొద్దు. చెబితే బాధపడతావ్ — ఇచ్చెయ్"

"ఇవ్వను."

"అసలున్నాయా? లేవా?"

"ఉన్నాయి. కాని దేనికో చెబితేగానివ్వను" అంటూ జేబులోంచి పర్సుతీసి, అందులోనుండి వందరూపాయల కాగితంతీసి చేత్తో పట్టుకున్నాను.

"అయితే చెబుతా" అంటూ నా చేతిలో కాగితాన్ని తను తీసుకుని పెన్నుతో, వంద కాగితం తెల్లటిభాగం పైన 'చక్కని. కోసం' అని రాశాడు.

వాడి కోడ్ భాష నా కర్థం కాలేదు— ్రడిగేశాను.

వాడు మధ్యలోవున్న 'డాట్'ని చూపిస్తూ అడిగాడు "ఇదేమిటి"

"చుక్క."

"గుడ్. అన్నీ కలిపి చదువు.'.

చదివాను "చక్కని చుక్క-కోసం" తర్వాతగాని నాకు కోపం రాలేదు. కాని వాడప్పటికే ఆ కాగితంతోపాటు ఆటో ఎక్కాడు.

వాడి వెనకాల నేను నవ్వుకున్నాను.

వాడెళ్ళిన కాస్సేపటికి నాకు అనుకోకుండా తలనొప్పి ప్రారంభమైంది. అది మధ్యాహ్నం అయ్యేసరికి భరింపరానిదిగా తయారైంది. ఇంక ఆఫీసులో కూర్చోలేక పర్మిషన్ పెట్టి వచ్చేశాను.

ఒక తలనొప్పి మాత్రమింగి, కాస్త కాఫీ త్రాగి ఇంటికొచ్చి పడుకుని నిద్రపోయాను. అలా ఎంతసేపు పడుకున్నానో నాకే తెలీదు.

తలుపుతట్టిన చప్పుడవటంతో వులిక్కిపడి లేచాను.

రాత్రి ఏడు గంటలయింది.

మెల్లిగా లేచి తలుపు తీసాను. వాకిట్లో కమల నవ్వుతూ నిలబడుంది.

స్నానంచేసి, వుతికిన చీర కట్టుకుని, నీటుగా ముస్తాబై నిలబడి "ఏవిటి మాష్టారు ఆఫీసు కెళ్ళలేదా? నిద్రపోతున్నారు ఎటూ కానివేళ" అడిగింది.

"ఆఫీసుకెళ్ళి తలనొప్పిగా వుంటే వచ్చి పడుకుని నిద్రపోయాను. టైం తెలీలేదు."

కమల లోనికెళ్ళి కూర్చుంది. నాకు నిద్ర మత్తు పూర్తిగా వదలకపోవటంవల్ల మౌనంగా కూర్చుండిపోయాను.

అలా నేను మూంగిలా కూర్చోటం ఆమె కిబ్బందిగా తోచిందేమో "ఏంలేదు మాష్టారు మీవద్ద డబ్బులు తీసుకుని చాలాకాలం అయింది. ఎప్పటికప్పుడు ఇచ్చేద్దాం అనుకుంటూనే అశ్రద్ధ అయిపోతోంది. ఇవ్వాళ డబ్బులొచ్చాయ్. ఇద్దామని వచ్చాను" అంటూ డబ్బు తీసి మంచంమీదుంచింది.

నేను ఆమెవంక చూస్తూ "ఏం పర్వాలేదు. అవసరమైతే నేనే అడిగేవాడిని" అన్నాను.

తర్వాత రెండునిమిషాలు కూర్చుని బజారు పనుందని వెళ్ళిపోయింది.

నేను లేచి తలుపుమూసి స్నానానికని బాత్ రూంకెళ్ళబోతూండగా డబ్బుతీసి పర్సులో పెట్టుకుందామని, ఆమె పరుపుమీదుంచిన నోటుని చేతిలో తీసుకున్నాను.

కరెంట్ తీగ పట్టుకున్నట్టుగా షాక్ తగిలింది-

అదేనోటు-వందరూపాయల నోటు-పొద్దున గోపాల్‌కి నేనిచ్చింది.

దానిమీద వాడు రాసిన 'చక్కని . కోసం' అన్నది అద్దంలో నా మొహంలా స్పష్టంగా కన్పిస్తోంది.

నాలోని ఓపికంతా నశించినట్లయింది.

గోపాల్ చెప్పిన 'మిణుగురు పురుగుల్ని చూసి నిప్పని భ్రమపడకు' అన్నమాట నా చెవుల్లో మార్మోగసాగింది.

అలా స్థాణువులా ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు. □